ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 30 ఏప్రిల్ 2024



నేడు రేగొండలో.. కాంగ్రెస్ జనజాతర

సభకు హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

- పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల నుంచి భారీగా జన సమీకరణ
- ఎండ తీవ్రత దృష్ట్యా షామియానాల ఏర్పాటు
- సభికుల కోసం మజ్జిగ, తాగునీటి సదుపాయం
- మధ్యాహ్నం 3గంటలకు సభ.. యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు

భూపాలపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో జనజాతర సభ జరగనుంది. ఈ సభకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరు కానుండగా ముఖ్యంగా పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల నుంచి 75వేలమందికి పైగా జనసమీకరణ చేస్తున్నారు. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు కసరత్తు పూర్తి చేశారు. వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న కడియం కావ్య సీనియర్ నేత కడియం

మిగతా 8వ పేజీలో..


అభివాదం చేస్తున్న నడ్డా, పక్కన మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్


సభకు హాజరైన ప్రజలు

బీజేపీతోనే.. అభివృద్ధి

- పదేళ్ల పాలనలో అన్నిరంగాల్లోనూ పురోగతి
- జాతీయ రహదారులకు మహర్దశ
- రామప్పకు యునెస్కో గుర్తింపునిచ్చింది బీజేపీయే..
- గిరిజన యూనివర్సిటీకి సమ్మక్క-సారలమ్మ పేరు
- మానుకోట జనసభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా


నడ్డాకు పూల మాల వేస్తున్న నాయకులు

మహబూబాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, బీజేపీ పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లోనూ పురోగతి సాధించి దేశం అభివృద్ధిలో అగ్రభాగానికి చేరిందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మానుకోట జనసభను సోమవారం నిర్వహించారు. ఈ సభకు హాజరైన నడ్డా మాట్లాడుతూ దేశంలోని జాతీయ రహదారులకు మహర్దశ కల్పించేందుకు కృషి చేశామని, హైదరాబాద్ నుంచి మహబూబాబాద్ మీదుగా భద్రాచలం వరకు జాతీయ రహదారి నిర్మించడంతో పాటు పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో హైదరాబాద్ తరహాలో పాస్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత బీజేపీదేనన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన చరిత్ర ప్రధాని మోదీదని, ప్రసిద్ధ రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు ఇవ్వడంతో పాటు జాతీయ గిరిజన యూనివర్సిటీని ములుగులో ఏర్పాటు చేసి సమ్మక్క-సారలమ్మ పేరిట నామకరణం చేశామన్నారు. మానుకోట నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని హామీ ఇచ్చారు. మానుకోట మునిసిపాలిటీని అమృత్ పథకంలో చేర్పేలా కృషి చేస్తామని, బంజారాల సమస్యల పరిష్కారానికి పాటుపడతామన్నారు. ఏకలవ్య రెసిడెన్షియల్, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని పేర్కొన్న ఆయన తమ ప్రభుత్వం ఎంతో ధైర్యంగా 370 ఆర్టికల్‌ను రద్దు చేసిందని, ఎస్టీల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు చేపట్టిందని తెలిపారు. మహబూబాబాద్ బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ మాట్లాడుతూ దేశంలో మళ్లీ బీజేపీదే అధికారమని, మూడోసారి ప్రధానిగా మోదీనేనని, తనను ఆశీర్వదించి గెలిపిస్తే 24గంటలు ప్రజాసేవలో ఉంటానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ ద్రోహులకు టిక్కెట్లు ఇచ్చిందని, తనకు బీఆర్ఎస్ టిక్కెట్ ఇవ్వకుండా మోసం చేస్తే బీజేపీ ఆదరించిందన్నారు. తాను గతంలో మానుకోట ఎంపీగా పనిచేసిన సమయంలో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశానని, ఇంకా చేయాల్సి ఉందన్నారు. బీజేపీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. తన మీద తనకు నమ్మకం లేక ఆయన దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని ఆరోపించారు. అబద్ధాల హామీలతో గద్దె నెక్కిన రేవంత్‌రెడ్డి వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో దోపిడీ, లంచగొండితనం పెరిగిందే తప్ప జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీ లక్ష్మణ్, మానుకోట ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, యాప సీతయ్య, వద్దిరాజు రాంచందర్‌రావు, చీకటి మహేష్‌గౌడ్, మోసంగి మురళి, సింగారపు సతీష్, భూక్య సంగీత, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, దార ఇందుభారతి, పల్లె సందీప్, చుక్కల నరేష్, సిరికొండ సంపత్, వల్లభు వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్‌శర్మ, శ్రీనివాస్, రాధాపటేల్, మదన్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గంట పర్యటనలో.. అరగంట ప్రసంగం..

సోమవారం మిట్ట మధ్యాహ్నం జరిగిన బీజేపీ మానుకోట జనసభ విజయవంతమైంది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా అధికారిక షెడ్యూల్ ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు మహబూబాబాద్ సభా వేదికపై ప్రసంగించాల్సి ఉంది. కానీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీ లక్ష్మణ్, మానుకోట అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌తో కలిసి వచ్చిన ఆయన అక్కడ్నుంచి నేరుగా కారులో ఎన్టీఆర్ స్టేడియంలోని సభావేదికపైకి సరిగ్గా 2.21 గంటలకు చేరుకున్నారు. పది నిమిషాల పాటు ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ ప్రసంగించిన అనంతరం 2.31 గంటలకు జేపీ నడ్డా ప్రసంగం ఆరంభమైంది. 30 నిమిషాల పాటు అనర్గళంగా తన ప్రసంగాన్ని కొనసాగించి 3.01 గంటలకు ముగించారు. ఆ తర్వాత పార్టీ శ్రేణులు ఆయన్ను సత్కరించాక హైదరాబాద్ తిరుగుపయనమయ్యారు. మానుకోట సభ మధ్యాహ్నం 3 గంటలకని ప్రకటించినా 12 గంటల నుంచే జనం రాక ప్రారంభమైంది. ఇక సభలో ప్రధాని మోదీ.. జైశ్రీరామ్ నినాదాలు వినిపించాయి.


మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ దగ్గర ఓ చిన్న హోటల్‌లో ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి కాఫీ తాగుతున్న కేసీఆర్

వరంగల్ లోక్‌సభ స్థానం మనదే..

- క్షేత్రస్థాయిలో పనిచేయండి..
- బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం
- బస్సు యాత్రకు నీరాజనాలు

7

సోమవారం ఉష్ణోగ్రత | గరిష్ఠం : 42.0°C | కనిష్ఠం : 26.0°C

అభ్యర్థుల లెక్క తేలింది..

- వరంగల్‌లో 42మంది.. మానుకోటలో 23మంది
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

7

ప్రశాంత ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 29:ప్రశాంత వాతావరణంలోపారదర్శకంగా లోక్‌సభ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ.దిలీబన్, ధీరజ్‌సింగా, రిటర్నింగ్ అధికారి ప్రావీణ్యలతో కలిసి పోటీలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ఉదయం 6 నుంచి 10గంటలలోపు ప్రచారం చేసుకోవాలన్నారు. కోడ్ ఉల్లంఘించినా, సోషల్ మీడియా వేదికగా ఫేక్‌న్యూస్, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు చేసే ఖర్చులను రేట్‌చాట్ ప్రకారం ఆపివేయాలని, ఇట్టి పీరియడ్‌లో ప్రచారం నిర్వహించకూడదని అన్నారు. అభ్యర్థి ఎన్నికల్లో రూ. 95 లక్షలకు మించి ఖర్చు ఖర్చు చేయడానికి వీలుదని, ఖర్చు పెట్టే ప్రతి రూపాయి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఏఆర్‌ఓ సంధ్యారాణి, రాధిక గుప్తా, ఏఆర్‌ఓలు డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, రోహిత్‌సింగ్, కె.శ్రీనివాస్, డీఎస్.వెంకన్న, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 29: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అమ్మ ఆదర్శ పాఠశాలల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఎంపిక అయిన పాఠశాలల్లో 663లో ఇప్పటి వరకు 117 పనులు గ్రౌండింగ్ అయ్యారన్నారు. మిగతా పనులకు మిగతా పనులకు ప్రణాళికలు పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను కమిటీ తీర్మానం ద్వారా ఆమోదం పొందిన పనులను జూన్ 5వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వేసవి సెలవులు ముగిసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తి చేయాలని సూచించారు. కమిటీల ఆధ్వర్యంలో రూ.25వేల లోపు చిన్న చిన్న పనులను మరమ్మతులు పనులను మే మొదటి వారంలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. సమావేశంలో డీఈవో వాసంతి, డీఆర్‌డీవో కౌసల్యదేవి, మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, మెప్మా పీడీ రేణుక, ఇంజనీరింగ్ అధికారులు సుధీర్‌రెడ్డి, చందర్‌రావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

దేశం కోసమే కాంగ్రెస్‌కు మద్దతు

- తెలంగాణ ద్రోహి కేసీఆర్
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ
- కేసీఆర్ పనైపోయింది.. ఇక కోలుకోవడం కష్టమే..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత నాదే..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న కడియం శ్రీహరి, సాంబశివరావు

న్యూశాయంపేట, ఏప్రిల్ 29: దేశం బాగుండాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ స్పష్టం చేశారు. సీపీఐ బలపరిచిన వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డీ కన్వెన్షన్‌హాల్‌లో సోమవారం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ.. ఈడీ, సీబీఐ, ఐటీ లాంటి వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని తన మాట విననని ఇతర పార్టీల నాయకులను మోదీ జైలుకు పంపిస్తున్నాడన్నారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తూ పేద ప్రజలను పట్టించుకోకుండా ఉన్నత వర్గాలకు కొమ్ము కాస్తూ రాముడి పేరు చెప్పుకుంటూ మోదీ రాజకీయం చేస్తున్నాడని ఆరోపించారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో ఆర్థిక నేరగాళ్లు పెరిగిపోయారన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ హోల్‌సేల్‌గా అమ్మకానికి పెట్టాడన్నారు. మోదీ హయాంలో అంబానీ, అదానీ ప్రపంచ కుబేరులుగా మారారని అన్నారు. కాంగ్రెస్ వస్తే మంగళ సూత్రాలు మిగలవని మాట్లాడే హక్కు మోదీకి లేదని, తన భార్య మంగళసూత్రాన్నే గౌరవించని మోదీకి ఇతరుల గురించి ఎందుకని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ద్రోహి అని, తెలంగాణ ప్రజలను నమ్మించి గొంతు కోశాడన్నారు. ఇక తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఖతం అయిందని, కోలుకోవడం కష్టమేనన్నారు.



పాట పాడి అలరించిన కడియం కావ్య

సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో డాక్టర్ కడియం కావ్య మాట్లాడటానికి ముందు 'ఎర్ర జెండ.. ఎర్ర జెండ ఎన్నియ్యల్లో.. ఎర్రెర్రని జెండా ఎన్నియ్యల్లో' అంటూ పాట పాడారు. దీంతో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కేకలు వేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ అతి ప్రమాదకరమైందన్నారు.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే ఆత్మహత్యాసదృశ్యమే అవుతుందన్నారు. మోదీకి అధికార దాహం ఎక్కువగా ఉంటుందని, దేశాన్ని తన పదవి కోసం కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేందుకు కూడా వెనకాడటం లేదన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి ప్రధానిగా అవకాశం వచ్చినా దేశం కోసం వదులుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలను, కమ్యూనిస్టు పార్టీలను మోసం చేసిన మాజీ సీఎం కేసీఆర్ పనైపోయిందని, ఇక లేవలేడని అన్నారు. పేద ప్రజల తరఫున నికరంగా నిలబడేది కమ్యూనిస్టు పార్టీలేనన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఎరుపు రంగుకు మరణం లేదని, తాను కూడా వామపక్ష భావజాలంతోనే పెరిగానని, సీపీఐ, సీపీఎం పార్టీలే తనను రాజకీయంగా నిలబెట్టాయన్నారు. ప్రస్తుతం దేశానికి మోదీ రూపంలో పెను ప్రమాదం పొంచి ఉందని, తప్పుదారిన బీజేపీకి ఓటు వేస్తే పేదల బతుకులు ఆగం అవుతాయన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో సేవాగుణం కలిగిన కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే ప్రస్తుతం తాను రాజకీయాల్లో పోటీ చేస్తున్నానని అన్నారు. రాజ్యాంగాన్ని మోదీ మారుస్తానంటున్నారని, అందుకే బీజేపీ అధికారంలోకి రావొద్దని, రాజ్యాంగాన్ని, లౌకిక వాదాన్ని కాపాడే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కేయూలో ఆదివారం సాయంత్రం మేధావులు, రచయితల సభపై మతోన్మాద శక్తులు దాడి చేశాయని, బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఇదే పరిస్థితి అంతటా ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాటలు అలరించాయి. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, నాయకులు బి.విజయసారథి, టి. వెంకట్రాములు, టి. విశ్వేశ్వర్‌రావు, జిల్లాల కార్యదర్శులు రాజారెడ్డి, రాజ్‌కుమార్, నాయకులు సిరబోయిన కరుణాకర్‌తోపాటు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామునూరు ఎయిర్‌పోర్టు పనులు పూర్తి చేయిస్తా..

- అంతర్గత కుమ్ములాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్


కొండూరులో మహిళతో మాట్లాడుతున్న అరూరి రమేష్


వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న రమేష్


రాయపర్తి, ఏప్రిల్ 29 : వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి, తనను గెలిపిస్తే మామునూరు ఎయిర్‌పోర్టు పనులు పూర్తి చేయిస్తానని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని పెర్కవేడు, కొండూరు, గట్టికల్లు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి, రాయపర్తిలో జరిగిన కార్నర్ మీటింగులో పాల్గొని మాట్లాడారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే, వరంగల్ లోక్‌సభ పరిధిలో ఉన్న ప్రతీ సమస్యను తీరుస్తానని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ చేసిన పాపాలను కడిగిన పార్టీ బీజేపీనేనని గుర్తు చేశారు. అంతర్గత కుమ్ములాటలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని, నేతలు చేసే ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. దేశంలో మూడోసారి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే వందేళ్ల అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందని కాంగ్రెస్ నేతలు విషప్రచారం చేస్తున్నారని, వారి కల్లబొల్లి మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని గుర్తుచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, కానీ చేతలు తంగేళ్లు దాటడం లేదంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చారని, కానీ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రపంచ నాయకుడిగా కీర్తి ప్రతిష్ఠలు అందుకుంటున్న ప్రధాన మంత్రి మోదీ మళ్లీ వస్తేనే దేశ ప్రజలు సుభిక్షంగా ఉంటారని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370 రద్దు చేసి కశ్మీర్‌లోని సమస్యను పరిష్కరించిన ఘనత నరేంద్ర మోదీదని, ఇది మోదీ, అమిత్‌షాల వల్లే సాధ్యమైందన్నారు.

అంతకుముందు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను అరూరి రమేష్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు బ్రహ్మరథం పట్టారు. హారతులు ఇచ్చి, బొట్టు పెట్టి, పూలు చల్లి స్వాగతం పలికారు. కూరగాయల షాపుల వద్ద సైతం ప్రజల బాధలు తెలుసుకుని, బీజేపీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పాలకుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి లేగ రాంమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, టి.రాజేశ్వర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీమాన్, రాయపర్తి మండల అధ్యక్షుడు రవి, జనరల్ సెక్రటరీ నవీన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు హేమ, పార్లమెంట్ మండల ఇన్‌చార్జి అనిల్, బీజేవైఎం కన్వీనర్ శ్రావణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షల నుంచి ఇద్దరు ఇన్విజిలేటర్ల తొలగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29: ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షల్లో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఇన్విజిలేటర్లను పరీక్షల ఉమ్మడి జిల్లా ప్రత్యేక పరిశీలకుడు పి.రాజీవ్ విధుల నుంచి తొలగించారు. సోమవారం హనుమకొండ వరంగల్, ములుగు జిల్లాల్లోని వివిధ పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాలలోని టీఎస్ఆర్‌డబ్ల్యు ఎస్-బి సెంటర్‌లో కాపీకి పాల్పడుతున్న విద్యార్థిని డీబార్ చేస్తూ అక్కడ విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించారు. ఇక ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల కేంద్రంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని మట్టెవాడ ప్రభుత్వ పాఠశాల కేంద్రాన్ని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావుతో కలిసి సందర్శించారు.

















కేసీఆరే పెద్ద మోసగాడు

● రాజకీయంగా ఎదుర్కోలేక నన్ను టార్గెట్ చేశాడు ● వరంగల్ అంటే కేసీఆర్‌కు గిట్టదు ● ప్రశ్నించే గొంతుకలు ఉంటాయని భయం ● ప్రజాస్వామ్య పరిరక్షణకు కావ్యను గెలిపించాలి ● స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 29: వరంగల్ రోడ్ షోలో తనను మోసగాడని అంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే అసలైన పెద్ద మోసగాడని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. తాను ఎక్కడ మోసాలకు పాల్పడ్డానో కేసీఆర్ బయటపెట్టాలని శ్రీహరి సవాల్ విసిరారు. కేసీఆర్, ఆయన కుటుంబం చేసిన అక్రమాలు, మోసాలు ప్రజల ముందుకు వస్తున్నాయన్నారు. సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు.

కేసీఆర్ తనను రాజకీయంగా ఎదుర్కొలేక టార్గెట్ చేసి నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ నిజ స్వరూపం భయంకరంగా ఉంటుందని కడియం శ్రీహరి ఆరోపించారు. కేసీఆర్ మోసపూరిత వైఖరి, కుట్రలు, అక్రమాలను దగ్గరగా చూసిన వాడిగా చెబుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఓఆర్ఆర్ చుట్టూ వేల కోట్ల విలువ చేసే భూములు కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు కాజేశారని ఆరోపించారు. రైతులు, భూ యజమానులు, నిరుపేదలను భయపెట్టి భూములు లాగేసుకున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత తీరుతో కేసీఆర్ సిగ్గుపడాలని శ్రీహరి విమర్శించారు. కవిత నిర్దోషి అయితే ఎందుకు బెయిల్ రావడం లేదని శ్రీహరి ప్రశ్నించారు. కవిత వల్లనే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ జైలుకు వెళ్లాడని వ్యాఖ్యానించారు. ఉద్యమాల గడ్డ ఓరుగల్లు అంటే కేసీఆర్‌కు గిట్టదని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఇక్కడ ప్రశ్నించే, చైతన్యవంతమైన గొంతుకలు ఉంటాయని, ఇది తనకు ప్రమాదకరమని భావించే వరంగల్ జిల్లాను కేసీఆర్ ఆరు ముక్కలుగా విభజించారన్నారు. నగరానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ తీసుకురాలేదని, మాస్టర్‌ప్లాన్ విడుదల చేయలేదని, ఇవన్నీ కూడా వరంగల్‌పై కేసీఆర్‌కు ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. కేయూలో జరిగిన ఘటన భయాందోళనలకు గురి చేస్తోందని కడియం శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక వాదం, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తూ ఈ పరిణామాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రానున్న మూడు నెలల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ దుకాణం బంద్ కానున్నట్లు శ్రీహరి చెప్పారు. భూకబ్జాదారుడు అరూరి రమేశ్‌ను బీజేపీలోకి పంపించిందే కేసీఆర్ అని ఆరోపించారు. బీజేపీతో కేసీఆర్ కుమ్మక్కు అయ్యారని, లోక్‌సభ ఎన్నికల్లో డమ్మీ అభ్యర్థులను బరిలో నిలుపారని చెప్పారు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టరు టి. రాజయ్యను చూస్తే జాలి వేస్తోందని కడియం శ్రీహరి చెప్పారు. రాజయ్యను తన ఫామ్‌హౌస్‌లోకి కేసీఆర్ అడుగు పెట్టనివ్వలేదన్నారు. ఈ తరుణంలో రాజయ్య కేసీఆర్ రోడ్ షోలో డ్యాన్సులు వేయడం, డప్పు కొట్టడం చూస్తే జాలి వేస్తోందని పునరుద్ఘాటించారు. నరేంద్రమోదీ మళ్లీ ప్రధానమంత్రి అయితే దేశంలో వినాశనమే అని కడియం శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. కులం, మతం పేరిట రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ వరంగల్ నగరానికి చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అభివృద్ధి పట్టాలెక్కి పరుగులు తీస్తోందన్నారు. పశ్చిమలో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నెల 24న మడికొండలో జరిగిన జన జాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా అభివృద్ధికి స్పష్టమైన హామీలు ఇచ్చిన సంగతి గుర్తుచేశారు. పట్టభద్రుల విభాగం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకోసం మోదీని ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ దొందు దొందేనని చెప్పారు.

కాగా, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నాతో పాటు ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి పార్టీ కండువాలతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంక సరళా, కూచన రవళి, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, డాక్టర్ శ్రవణ్‌కుమార్, అజీజ్‌ఖాన్, తాడిశెట్టి విద్యాసాగర్, కూర వెంకట్‌తో పాటు కార్పొరేటర్లు తోట వెంకన్న, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ లోక్‌సభ స్థానం మనదే..

క్షేత్రస్థాయిలో పనిచేయండి.. : బీఆర్ఎస్ నేతలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం



బస్సులో ఖమ్మం వెళుతున్న మాజీ సీఎం కేసీఆర్

రాంనగర్, ఏప్రిల్ 29: 'వరంగల్ లోక్‌సభ స్థానం మనం గెలుస్తున్నాం.. నేతలంతా ఫీల్డ్ వర్క్ చేయండి..' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నేతలకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నగరంలో రోడ్ షో నిర్వహించిన కేసీఆర్.. రాత్రి హనుమకొండలోని మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు నివాసంలో బస చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, సారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, సతీష్‌బాబు తదితరులతో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. సర్వేలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయని, మనమే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. నేతలు ఫీల్డ్ వర్క్ చేయాలని సూచించారు. సభ సక్సెస్ కావడంపట్ల నేతలను ప్రశంసించారు. కేడర్‌లో మంచి జోష్ ఉందని తెలిపారు. కేడర్‌కు భరోసా ఇస్తూ ప్రచారం చేయాలని, సుధీర్‌కుమార్ గెలుపునకు నేతలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కాగా, కేసీఆర్ సోమవారం వినయభాస్కర్‌తో పాటు కొంతమంది ఉద్యమకారులను మినహా ముఖ్యనేతలను ఎవరినీ కలువలేదు. సాయంత్రం ఎన్నికల ప్రచారం కోసం కేసీఆర్ బస్సులో ఖమ్మం బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఖమ్మం, కొత్తగూడెంలో ప్రచారం నిర్వహించి అక్కడే బస చేస్తారు. బుధవారం మహబూబాబాద్‌లో రోడ్ షోలో పాల్గొని రాత్రికి హనుమకొండలోని కెప్టెన్ నివాసానికి చేరుకుని ఇక్కడే బస చేయనున్నారు. మొత్తంగా నగరంలో కేసీఆర్ రోడ్ షో సక్సెస్ కావడం నేతలు, క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

కేసీఆర్ బస్సు యాత్రకు నీరాజనాలు

తొర్రూరు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచార సభలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వరంగల్ నుంచి ఖమ్మం సభకు వెళ్తున్న క్రమంలో సోమవారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో బస్సులో నుంచే ప్రజలకు అభివాదం చేశారు. ఈ క్రమంలో కార్యకర్తలు 'జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ కాసేపు ఆగిన కేసీఆర్.. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, తదితర నేతలున్నారు.

బజ్జీలు తిని.. కాఫీ తాగి..

మరిపెడలో స్థానికులతో మాట్లాడిన కేసీఆర్

మరిపెడ, ఏప్రిల్ 29: వరంగల్‌లో ఆదివారం రాత్రి బస్సుయాత్ర, కార్నర్‌మీటింగ్ పూర్తిచేసుకున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. సోమవారం సాయంత్రం ఖమ్మంలో జరిగే బస్సుయాత్ర, సభకు వెళుతూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ దగ్గర ఆగారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి రోడ్డు పక్కన ఉన్న ఓ చిన్న హోటల్‌లోకి వెళ్లిన ఆయన.. బజ్జీలు తిని, కాఫీ తాగారు. కేసీఆర్‌ను చూసిన జనాలు కొందరు అక్కడికి చేరుకోగా ఆయన వారి బాగోగులను అడిగారు. ఆ తర్వాత కేసీఆర్ రైతులను పలకరించగా.. రైతులు తమ కష్టాలను ఏకరువు పెట్టారు. దాంతో ఏ మాత్రం ధైర్యం చెడొద్దని రానున్నవన్నీ మంచి రోజులేనని వారికి భరోసానిచ్చారు.


మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ దగ్గర ఓ హోటల్‌లో స్థానికులతో ముచ్చటిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

నిబంధనల మేరకే గుర్తుల కేటాయింపు

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 29: ఎన్నికల సంఘం నిబంధనల మేరకే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తుల కేటాయించినట్లు వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, వరంగల్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ సమక్షంలో అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు జరిపారు. అనంతరం ప్రావీణ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీలకు ప్రత్యేకంగా ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించిందని, ఎన్నికల సంఘంచే గుర్తింపు పొందని, రిజిస్టర్ కాని, స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు తెలుగు అక్షరమాల ప్రామాణికంగా గుర్తులు కేటాయించినట్లు తెలిపారు. ఒకే గుర్తును ప్రతిపాదించిన ఇద్దరు అభ్యర్థులకు డ్రా పద్ధతిలో గుర్తు కేటాయించామన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సహాయ ఆర్‌ఓ కె.శ్రీనివాస్, ఏఆర్‌ఓలు డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, రాధిక గుప్తా, పీయూష్ కుమార్, డిఎస్.వెంకన్న, రోహిత్‌సింగ్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సీదం దత్తు, కె.వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల పోలీస్ నోడల్ అధికారులు, వివిధ పార్టీల నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య


ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కావ్య కులమేంటో బహిర్గతం చేయాలి

● ముస్లిం మత ప్రకారం వివాహం చేసుకుంటే ఎస్సీ సర్టిఫికెట్ చెల్లదు
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

వడ్డెపల్లి, ఏప్రిల్ 29: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీలో ఉన్న డాక్టర్ కడియం కావ్యది ఏ కులమో ఆమె తండ్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బహిర్గతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం కావ్య ముస్లిం మతం ప్రకారం వివాహం చేసుకుంటే ఎస్సీ సర్టిఫికెట్ వర్తించదని అన్నారు. ఎస్సీ సామాజికవర్గం కాని కడియం కావ్యకు వరంగల్ లోక్‌సభకు పోటీ చేసే అర్హతేలేదని మంద కృష్ణ మాదిగ అన్నారు. కడియం కావ్య కులంపై న్యాయపోరాటం చేస్తామని, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరిది బైండ్ల కులం కాదని, అసలు అతడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారే కాదని ఇంతకుముందు రేవంత్‌రెడ్డి అన్నారని మంద కృష్ణ గుర్తు చేశారు. ఆయన కులమేదో కడియం నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ ఎస్సీ సర్టిఫికెట్‌తో కడియం శ్రీహరి 40 ఏళ్లుగా నిజమైన దళితుల అవకాశాలను దోచుకుంటున్నాడని దుయ్యబట్టారు. కడియం కావ్యకు రిజిస్టర్ మ్యారేజ్ చేశారా? ముస్లిం సంప్రదాయం ప్రకారం పెళ్లి చేశారా? హిందూ మత ప్రకారం వివాహం జరిపించారా? అనేది కడియం శ్రీహరి స్పష్టం చేయాలని అన్నారు. ముస్లింను వివాహమాడిన కావ్యకు ముస్లిం మతమే వర్తిస్తుందని, ముమ్మాటికీ కడియం కావ్య ముస్లిమేనని మంద కృష్ణ స్పష్టం చేశారు. కడియం కావ్య వివాహంపై తమకు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. కడియం కావ్య ఎస్సీ సర్టిఫికెట్ జారీపై తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌తోపాటు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని, న్యాయపోరాటానికి సైతం వెనుకాడబోమని మంద కృష్ణ తెలిపారు.

కడియం శ్రీహరికి నీతి, నిజాయితీ, విలువలులేని వ్యక్తి అని, నిజమైన దళితుల అవకాశాలను అనుభవిస్తున్నాడని మందకృష్ణ విమర్శించారు. కడియం కావ్య ఒకవేళ గెలిచినా.. ఉప ఎన్నిక తప్పదన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఓటర్లు విజ్ఞతతో ఓటు వేసి తగిన తీర్పును ఇవ్వాలని మంద కృష్ణ మాదిగ కోరారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం తాను క్షమాపణ చెబుతాడని కడియం శ్రీహరి ప్రకటించడం హాస్యాస్పదమని అన్నారు. అసలు ఆయన ముఖమే చూడనని, అలాంటిది క్షమాపణ చెప్పడమేంటని ఎద్దేవా చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు కడియం శ్రీహరిని లాక్కొచ్చి తప్పులన్నీ ఒప్పించి నేలకు ముక్కును రాయిస్తామని మందకృష్ణ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎంఎస్‌పీ వరంగల్ ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్‌తో పాటు జిల్లా నాయకులు జేరిపోతుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రోడ్డు షోలో నిబంధనలు పాటించని పలువురిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్29: మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం నిర్వహించిన రోడ్డుషోలో అనుమతులు లేకుండా గ్యాస్‌తో పేపర్లు చల్లుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం.. కేసీఆర్ రోడ్డుషో సందర్భంగా మర్కజీ సెంటర్‌లో రోడ్డుపై కొంతమంది వ్యక్తులు ఆటోలో గ్యాస్, బీఆర్ఎస్ జెండాలు ఏర్పాటు చేసుకొని పేపర్లను చల్లారు. అక్కడే ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సదరు వ్యక్తులను అనుమతులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ఎలాంటి అనుమతులు లేవని ఒప్పుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ లెక్చరర్ ఎ.శ్రీను ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్లు రహీమ్, శ్రీను, రంజిత్, సుధాకర్, స్వామిలపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు.

అభ్యర్థుల లెక్క తేలింది..

వరంగల్‌లో 42మంది.. మానుకోటలో 23మంది ● ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

వరంగల్ కలెక్టరేట్/ మహబూబాబాద్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగియడంతో అటు వరంగల్, ఇటు మహబూబాబాద్ నియోజకవర్గాల బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. ఉపసంహరణ అనంతరం వరంగల్‌లో 42మంది, మానుకోటలో 23మంది బరిలో నిలిచారు. ఈనెల 18 నుంచి 25వతేదీ వరకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ జరగ్గా మొత్తం 58 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆ తర్వాత 26వ తేదీన నిర్వహించిన పరిశీలనలో 10మంది నామినేషన్లు తిరస్కరణకు గురవడంతో.. 48 మంది అభ్యర్థులు మిగిలారు. వారిలో ఆరుగురు సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో బరిలో 42 మంది మిగిలారు. వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు చిన్నచితక పార్టీల నుంచి 15 మంది, స్వతంత్ర అభ్యర్థులు ఏకంగా 27మంది పోటీ చేస్తున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్‌కు తొలుత మొత్తం 30 మంది నామినేషన్లు వేయగా.. వారిలో పరిశీలనలో ఐదుగురి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. ఇక ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో బరిలో 23 మంది మిగిలారు.

ఉపసంహరించుకున్న అభ్యర్థులు

● వరంగల్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన ఇల్లందుల శోభన్‌బాబు, కుమ్మరి కన్నయ్య, బర్ల బాబు, మార్త రాజభద్రయ్య, డాక్టర్ విజయ్ కుమార్, ఇసంపెల్లి వేణు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

● మానుకోటలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు పోరిక సామ్యుల్, పోరిక అశోక్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

వరంగల్, మానుకోటల్లో బరిలో నిలిచింది వీరే..

వరంగల్ నియోజకవర్గం నుంచి మొత్తం 42మంది బరిలో నిలిచారు. అరూరి రమేశ్ (బీజేపీ), కడియం కావ్య (కాంగ్రెస్), మారపల్లి సుధీర్ కుమార్ (బీఆర్ఎస్), పంజా కల్పన (బీఎస్పీ), ఏఆర్.నేనా ప్రేమ్ రెడ్డి రిపిక (మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ), అంబోజు బుద్దయ్య (అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), మాస్ సావిత్రి (ఎంసీపీఐ(యూ), గాదం మల్లేశ్ (జై భారత్ నేషనల్ పార్టీ), పెండెల దేవరాజ్ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యూలర్), నర్మద ప్రవీణ్ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), పసుల రవి (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలె), బుంగ జ్యోతి రమణ (ఐహ్రా నేషనల్ పార్టీ), మచ్చ దేవేందర్ (విడుతలై చిరుతైగల్ కట్చి పార్టీ), మేకల సుమన్ (ధర్మసమాజ్ పార్టీ), ఎస్‌పికే.సాగర్ (జై మహాభారత్ పార్టీ) బరిలో ఉన్నారు. వీరితో పాటు స్వతంత్రులుగా నామినేషన్లు వేసిన గాదెపాక అనిల్ కుమార్, కొయ్యడ నరేశ్, కొంగర అనిల్ కుమార్, గడ్డం చిరంజీవి, గన్నారపు రవీందర్, గనిపాక ప్రదీప్, ఆర్కే గణపురం, చిలుముల్ల సుజాత, చిలువేరు ప్రతాప్, తాటికాయల సతీష్‌బాబు, తాండ్ర ఈశ్వర్, తాళ్లపల్లి వెంకటయ్య, గజ్జి దయాకర్, పుట్ట వినోద్ కుమార్, పైతర అచ్యుత్, పోగుల అశోక్, పోతరాజు నరసింహరాజు, జన్ను ప్రమీల, బరిగెల శివ, బొచ్చు రాజు, బొల్లం విజయ్ కుమార్, బాషిపాక సుధాకర్, మోత్కుపల్లి ప్రభాకర్, మంగళంపెల్లి ఆశయ్య, మంద నరేశ్, శనిగరపు రమేశ్‌బాబు, పోలెపాక రూప బరిలో ఉన్నారు.


నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్లు రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు లేఖ సమర్పిస్తున్న స్వతంత్ర అభ్యర్థి

● మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 23 మంది పోటీలో ఉన్నారు. అజ్మీర సీతారాం నాయక్(బీజేపీ), మాలోతు కవిత(బీఆర్ఎస్), కోనేటి సుజాత(బీఎస్పీ), పోరిక బలరాంనాయక్(కాంగ్రెస్), మైపతి అరుణ్‌కుమార్(ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), బుర్క కృష్ణవేణి(సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా), బానోత్ లింగన్న(బ్లూ ఇండియా పార్టీ), జాటోతు రఘువర్మ(ఆధార్ పార్టీ), రవ్వ భద్రమ్మ(ధర్మ సమాజ్ పార్టీ), వాంకుడోతు రవికుమార్(తెలంగాణ జాగీర్ పార్టీ), సోడె వెంకటేశ్వర్లు(గోండ్వానా దండకారణ్య పార్టీ), సోయం కన్నరాజు(గోండ్వానా గణతంత్ర పార్టీ) బరిలో నిలిచారు. ఇక స్వతంత్రులుగా బోడ అనిల్‌కుమార్, గుగులోతు శేఖర్‌నాయక్, చందా లింగయ్య, పాల్వంచ దుర్గ, డీవీ నాయక్, పడిగె ఎర్రయ్య, పాయం సింగరాజు, బానోత్ ప్రేమ్‌నాయక్, బానోత్ లింగ్యానాయక్, బోడ ప్రశాంత్, మోకాళ్ల మురళీకృష్ణ పోటీ చేస్తున్నారు.



చెక్‌పోస్ట్ వద్ద వివరాలను అడిగి తెలుసుకుంటున్న దీలిబన్

చెక్‌పోస్ట్‌ల పరిశీలన

గీసుగొండ, ఏప్రిల్ 29: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీం ఆధ్వర్యంలో కొమ్మాల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను వరంగల్ పార్లమెంటు వ్యయ పరిశీలకుడు ఐఆర్ఎస్ అధికారి దీలిబన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్టీ తనిఖీల ప్రక్రియను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దిన్, ఎస్ఎస్టీ బృందం అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

సంగెం, ఏప్రిల్ 29: కృష్ణానగర్ గ్రామానికి చెందిన పలువురు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో, మండలపార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలను కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ఎదునూరి కోటిరెడ్డి, వంగ కొమురయ్య, కసరబోయిన శ్రీనాథ్, కుక్కల రాజు, రాయపురి శ్రీనివాస్, కొయ్యల ఎల్లయ్య, సదిరం కట్టయ్య, వేల్పుల గణేష్, సదిరం రాజబాబు, వేల్పుల దేవరాజ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దుడ్డు రాజుయాదవ్, మండల ఉపాధ్యక్షుడు గోపతి కట్టయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు గోపతి రవియాదవ్, మేకల బుచ్చయ్య, గోపతి రాజయ్య పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు

కాశిబుగ్గ, ఏప్రిల్ 29: వరంగల్ నగరంలోని కాశిబుగ్గ చౌరస్తాలోని సెంట్రల్ లైటింగ్ సిస్టంకు సోమవారం మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. కొద్ది రోజులుగా కాశిబుగ్గ జంక్షన్‌లో సెంట్రల్ లైట్లు వెలుగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో మరమ్మతులు చేపట్టి లైట్లను అమర్చారు.

కాశిబుగ్గలో మజ్జిగ పంపిణీ

కాశిబుగ్గ, ఏప్రిల్ 29: కాశిబుగ్గ చౌరస్తాలో లక్ష్మిగణతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో సోమవారం మజ్జిగను పంపిణీ చేశారు. దాతలు కృష్ణ, స్వప్న దంపతులు, చంద్రశేఖర్ భవాని దంపతులు మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మిగణపతి సహకార పరపతి సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, వంగరి రవి, కోట నగేష్, ఐలయ్య పాల్గొన్నారు.

జాతీయ జెండాకు అవమానం

కరీమాబాద్, ఏప్రిల్ 29: జాతీయ జెండాకు అవమానం జరిగింది. చెత్తకుప్పల్లో కాషాయ జెండాలతో జాతీయ జెండాను సైతం పడవేసిన పారిశుధ్య కార్మికులపై రంగశాయిపేట వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే కోడ్ నేపథ్యంలో నగరంలోని ప్రధాన కూడళ్లలో పార్టీల జెండాలు తొలగించాలని అధికారుల ఆదేశాల మేరకు పారిశుధ్య కార్మికులు రంగశాయిపేటలోని రామాలయం వద్ద ఇటీవల శ్రీరామ నవమి వేడుకల కోసం ఏర్పాటు చేసిన కాషాయ జెండాలను తొలగించారు. ఈ క్రమంలో అక్కడే కట్టి ఉన్న జాతీయ జెండాను సైతం తొలగించి కాషాయ జెండాలతో కలిపి సమీపంలోని చెత్తకుప్పల్లో పడేశారు. ఈ విషయం సోషల్ మీడియా వేదికగా ప్రచారం కావడంతో భజరంగ్ దళ్ కార్యకర్తలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రాజేష్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కార్పొరేటర్ అరెస్టు

కరీమాబాద్, ఏప్రిల్ 29: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవిని సోమవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మిల్స్‌కాలనీ పోలీసుల కథనం ప్రకారం. ఉర్సు ప్రాంతానికి చెందిన పసునూరి అరవింద్ తన పెద్దనాన్న పసునూరి ఎల్లస్వామి, పసునూరి రాజేంద్రప్రసాద్, పెద్దమ్మ ఎలీషా, వారి కుమారులు విక్రమ్, బాలకృష్ణల మధ్య స్థలం కొనుగోలు విషయంలో 2012 నుంచి భూ తగాదాలు నడుస్తున్నాయి.

ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 12న అరవింద్ కుమ్మరివాడలోని తన ప్లాటును చూస్తుండగా, అదే సమయంలో తన పెద్దనాన్న ఎల్లస్వామి, పెద్దమ్మ, ఏలీషా, వారి కుమారులు విక్రమ్, బాలకృష్ణలు అక్కడికి వచ్చారు. కార్పొరేటర్ రవి సపోర్ట్‌తో చంపేస్తామని బెదిరించడంతోపాటు, కులం పేరుతో దూషించారు. దీంతో అరవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కేసులో ఏసీపీ నందిరామ్ నాయక్ విచారణ చేపట్టి కార్పొరేటర్ మరుపల్ల రవిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

తగ్గిన బంగారం ధర

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 29: అధికంగా పెరిగిన బంగారం,వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం తులం బంగారం రూ.72వేలకు చేరుకుంది. గత వారం రోజుల క్రితం తులం బంగారం రూ. 75,600 చేరుకోగా సోమవారం మార్కెట్ ధర రూ.72వేల వరకు చేరింది. ఒక్కసారిగా రూ. 3,600 వరకు తగ్గింది. శుభకార్యాలు, ముహూర్తాలు లేకపోవడంతో ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. వెండి కూడా కిలో ధర రూ. 86 వేలు ఉండగా సోమవారం ధర రూ. 83,500లకు తగ్గుముఖం పట్టింది. 22 క్యారెట్ల బంగారం రూ. 72 వేలు ఉండగా సోమవారం రూ. 65,950 కి చేరుకుంది. రాబోయే రోజుల్లో బంగారం, వెండి ధరలు మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● తాగునీటి సరఫరా ప్రత్యేక పర్యవేక్షణాధికారి గోపి ● బల్దియాలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 29: గ్రేటర్ వరంగల్ నగరంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా తాగునీటి సరఫరా ప్రత్యేక పర్యవేక్షణాధికారి డాక్టర్ బి.గోపి అధికారులకు సూచించారు. సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో వివిధ విభాగాల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా కేయూలో ఫిల్టర్ బెడ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతీ రోజు ఎన్ని ఎంఎల్‌డీల నీరు సరఫరా చేస్తున్నారు.. ఏయే ప్రాంతాల్లో తాగునీటి సమస్యలున్నాయి.. ఏ ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.. అనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం గోపి మాట్లాడుతూ.. వేసవికాలంలో భూగర్భజలాలు అడిగంటి పోతాయని, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేటర్‌లోని 66 డివిజన్‌లకు సరిపడా తాగునీటి వనరులు అందుబాటులో ఉన్నాయని, అధికారులు సమన్వయంతో పని చేసి తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ప్రస్తుతం ప్రతీ రోజు 210 ఎంఎల్‌డీల నీటి సరఫరా చేస్తున్నారని, దీనికి అదనంగా మరో 40 ఎంఎల్‌డీల నీరు సరఫరా చేయాలని సూచించారు. వేసవికాలం ముగిసే వరకు సిబ్బందికి సెలవులుండవని, ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. నగరంలో సమస్యాత్మకమైన ప్రాంతాల్లో అధికారులు దృష్టిసారించాలన్నారు. ఇంకా నీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే స్వయం సహాయక బృందాలు, రెసిడెంట్ వెల్ఫేర్ సంఘాల సహాయాన్ని తీసుకోవాలన్నారు.

హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ.. నీటి సరఫరాపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నీటి సమస్యను ఎప్పటికప్పుడు త్వరితగతిని పరిష్కరించాలన్నారు. ప్రతీ కాలనీకి చివరి వరకు నీటి సరఫరా అందే వరకు అధికారులు చొరవ చూపాలన్నారు. రెండు మాసాల పాటు ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరా అందించాలన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నాలుగు ఫిల్టర్‌బెడ్‌ల ద్వారా 66 డివిజన్‌కు తాగు నీరు అందిస్తున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలకు ప్రస్తుతం 24 ట్రాక్టర్ల ద్వారా మంచి నీరు సరఫరా చేస్తున్నామని,



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి గోపి

ఈ వేసవిలో మరో 25 ట్రాక్టర్‌లను తీసుకుని నీటి సరఫరా చేస్తామన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం తాగునీరు అందిస్తున్నామన్నారు. ప్రతీ డివిజన్‌కు ఒక ఏఈ స్థాయి అధికారి ద్వారా పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, పీహెచ్ ఈఈ రాజ్‌కుమార్, రాజయ్య, బి.ఎల్. శ్రీనివాస్, ప్రత్యేక అధికారులు, ఏఈలు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపు ఖాయం

కాబోయే ప్రధాని రాహుల్ గాంధీనే..
వ్యవసాయశాఖ మంత్రి, పార్లమెంట్ ఇన్‌చార్జ్
తుమ్మల నాగేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగేశ్వర్‌రావు

దుగ్గొండి, ఏప్రిల్ 29: మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాం నాయక్ గెలుపు ఖాయమని, ప్రధానిగా రాహుల్ గాంధీ అవడం తథ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి పార్లమెంట్ ఇన్‌చార్జి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో గత పాలకులు అప్పుల రాష్ట్రంగా తయారు చేయగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసిందన్నారు. దేశంలో బీజేపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతుల సంక్షేమం వదిలి నల్ల చట్టాలు తెచ్చిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. రైతులు తిరగ బడితే వారిని కొట్టించడం, ఉక్కుపాదం మోపిన కీర్తి పీఎం నరేంద్రమోదీకే చెల్లుబాటైందన్నారు.

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని అన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధిని ప్రజలు చూశారని, బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు కష్టాలు అనుభవించారన్నారు. గత ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతు ఆత్మహత్యలు కూడా పెరిగాయన్నారు. రైతులపై చిత్తశుద్ధిలేని కారణంగా రైతుల అప్పుల ఊబిలో కూరుకు పోయారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి, అమలు చేస్తోందన్నారు. భారీ మెజార్టీతో బలరాంనాయక్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని పిలుపునిచ్చారు.

ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలకు సేవకుడిగా పని చేస్తానన్నారు. గత ఎంపీగా గెలిచిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్రాలకు వారధిగా పనిచేసి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో డీసీసీ అధికారి ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, రంజిత్‌రెడ్డి, పెండెం రామనాధం, పాలయి శ్రీనివాస్, ఓర్సు తిరుపతి, ఎర్రెల బాబు, పార్వతమ్మ, ఒలిగె నర్సింగరావు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, చుక్క రమేశ్, జయరాంనాయక్, గోపాల్ నాయక్, పాల్గొన్నారు.

ఐపీఈ ఫలితాల్లో వరంగల్ నారాయణ ఆల్‌టైమ్ రికార్డు



అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న బ్రాంచి ఏజీఎం అనిల్ గవాస్కర్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29: ఇంటర్ ఫలితాల్లో వరంగల్‌లోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆల్‌టైమ్ రికార్డు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల జీఎం ఎం.కె.శ్రీనివాస్, కోర్‌డీన్ రాధాకృష్ణ అన్నారు. సోమవారం కళాశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎంపీసీ విభాగంలో పి.జాహ్నవి 469 మార్కులు సాధించగా, మరో 18 మంది విద్యార్థులు 460 మార్కులకు పైగా సాధించారు. బైపీసీ విభాగంలో కె.సంజనశ్రీ, డి.శ్రావిక 436 మార్కులు సాధించగా మరో ఐదుగురు విద్యార్థులు 400మార్కులకు పైగా సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి. ఆశ్రిత 990 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలువగా, హాషితరెడ్డి 988 మార్కులు సాధించారు. బైపీసీలో ఎ.హర్షిత 986 మార్కులు సాధించారు.

వరంగల్‌లో నారాయణ జూనియర్ కళాశాలను స్థాపించిన నాటి నుంచి విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌తో పటిష్టమైన మైక్రో షెడ్యూల్స్‌ను రూపొందించి కాన్సెప్చువల్ ఓరియెంటేషన్ పద్ధతిలో విద్యాబోధన చేస్తుండటంతో విద్యార్థులు ఆరంభంలోనే అదుర్స్ అనిపించారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బ్రాంచి ఏజీఎం అనిల్ గవాస్కర్, ప్రిన్సిపాల్ కె.తిరుపతిరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్, ఏవో మామిడాల హరీష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జాతి ముందు.. తర్వాతే పార్టీలు

● బీజేపీతో దళితజాతి మనుగడకు ముప్పు
● ఆ పార్టీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కే ఉంది
● మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

గీసుగొండ, ఏప్రిల్ 29: తనకు జాతి ముందని, తర్వాతే పార్టీలని, పార్టీలు ఏవైనా జాతిని మర్చిపోవద్దని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం కొనాయిమాకులలోని ఓ ఫంక్షన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రిజర్వేషన్‌లను రద్దుచేసి జాతి మనుగడకు ముప్పు తెస్తోందని, దానిని అడ్డుకునే సత్తా ఒక కాంగ్రెస్‌కే ఉందన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు కడియం వెల్లడించారు. కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే బీజేపీ కావాలో, అన్ని వర్గాలకు ప్రేమను పంచే కాంగ్రెస్ కావాలో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికలు దళితజాతి మనుగడ, భవిష్యత్‌కు సంబంధించినవిగా భావించాలన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో దళిత మహిళలపై అత్యాచారాలు చేసి అడ్రస్ లేకుండా తగుల పెడుతున్నారన్నారు. బీజేపీ దుర్మార్గాలకు, ఆకృత్యాలకు ఇవి నిదర్శనాలు అన్నారు. దళితుల భవిష్యత్‌ను అంధకారం చేయాలని చూస్తున్న బీజేపీకి ఓటు వేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చెప్పి జాతిని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే దేశం రక్షించబడుతుందన్నారు.

వరంగల్ పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ దళిత వ్యతిరేకంటూ మండిపడ్డారు. మాదిగ జాతిని తప్పుదోవ పట్టించిన కృష్ణమాదిగ బీజేపీకి ఏజెంటుగా మారారన్నారు. అదాని, అంబానీలకు దేశసంపదను దోచిపెడుతున్న బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెపుతారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రీతమ్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, రాష్ట్ర నాయకులు వరద రాజేశ్వర్‌రావు, ప్రొఫెసర్ గాదె దయాకర్, రాధకృష్ణ, భద్రయ్య, సాంబయ్య, ఎంపీపీ భీమగాని సౌజన్య, అధికార ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, చాడా కొమురారెడ్డి, దూపాకి సంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే ఆర్యవైశ్యుల మద్దతు

● వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు



మాట్లాడుతున్న మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు

మట్టెవాడ, ఏప్రిల్ 29: వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటుతో బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకే ఆర్యవైశ్యుల తమ మద్దతు ఉంటుందని వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు స్పష్టం చేశారు. సోమవారం వరంగల్ ఆర్ఎన్‌టి రోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య సంఘం భవన్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు మాట్లాడుతూ పదేళ్లలో ఇచ్చిన హామీలను నెరవేర్చని మోదీ, కేసీఆర్‌లను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. విభజన చట్టంలోని హామీలను మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదని, అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. వరంగల్‌కు కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ నేటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు.

కేసీఆర్ పాలనలో ఆర్థిక విధ్వంసం

పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, రైతులకు రుణమాఫీ చేయలేదని ప్రకాశ్ విమర్శించారు. ప్రాజెక్టులు, అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని ఇందుకు కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలే కారణమంటూ ఆరోపించారు. ఆర్యవైశ్య సంఘాల సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావ్యకు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనుపునూరి వీరన్న, వరంగల్ జిల్లా అవోపా అధ్యక్షుడు మల్యాల వీరమల్లయ్య, వాసవి క్లబ్ వరంగల్ అధ్యక్షుడు బెలిదే వెంకటేశ్వర్లు, గుండా మల్లికార్జున్, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఖిలావరంగల్, ఏప్రిల్ 29: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సీనియర్ గుమస్తా గజ్జెల రా ములు కుటుంబానికి వరంగల్ ఏనుమాముల గుమస్తాల సంఘం ఆర్థికసాయం అందించింది. సోమవారం పడమరకోటలోని మృతుడి నివాసంలో రూ.21వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం వర్కిం గ్ ప్రెసిడెంట్ పుప్పాల రాజేందర్, ఉపాధ్యక్షుడు ముత్తినేని శ్రీనివాస్, కోశాధికారి ఇనుముల వైకుంఠం, దేవేందర్, బేతి మురళీ, ఆర్గనైజర్‌లు బొలిశెట్టి సదానందం, కాటన్ సెక్షన్ బొట్టు వేణు పాల్గొన్నారు.

● గీసుగొండ: గీసుగొండలో నిరుపేద కుటుంబానికి చెందిన చినగారి రాజు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ.5 వేలు పంపించగా సోషల్ సర్వీస్ టీం సభ్యులు సో మవారం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబు, టీం సభ్యులు కర్ణకంటి రామ్మూర్తి, ముల్క సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే చంద్రయపల్లిలో యాదాండ్ల రాజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సామాజికవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.3వేలు అందచేశారు. కార్యక్రమంలో అల్లం మల్రెడ్డి, వేణు, రవిందర్ పాల్గొన్నారు.

జగదీశ్వర్‌ను పరామర్శ

కరీమాబాద్: రంగశాయిపేట డెవలప్‌మెంట్ సొసైటీ 21 కాలనీల గౌరవ అధ్యక్షుడు రామానుజం జగదీశ్వర్‌ను సోమవారం బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పరామర్శించారు. జగదీశ్వర్ నాలుగు రోజులుగా అనారోగ్యంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రదీప్‌రావు, రంగశాయిపేట డెవలప్మెంట్ సొసైటీ 21 కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్‌తో వెళ్లి పరామర్శించి వైద్యులతో మాట్లాడి సరైన వైద్యం అందేలా చూడాలని వైద్యులను కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితుల అరెస్టు

5.7 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య

కరీమాబాద్, ఏప్రిల్ 29: గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 5.7 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తెలిపారు. సోమవారం రాత్రి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వివరాలను వెల్లడిస్తూ సోమవారం మధ్యాహ్నం ఆర్‌టీఏ జంక్షన్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు వేరు వేరు బ్యాగులు పట్టుకొని నడుచుకుంటూ వెళుతున్నారు. అదే సమయంలో వాహనాల తనిఖీలో ఉన్న పోలీసులను చూసి పారిపోతుండగా గమనించిన పోలీసులు అనుమానంతో వారిని పట్టుకొని వారి బ్యాగులు తనిఖీ చేయగా అందులో ఇద్దరి వద్ద కలిపి 5.7కిలోల ఎండు గంజాయిని లభించినట్లు తెలిపారు. విచారణలో నిందితులు రంగశాయిపేట ప్రాంతం మంగళమ్మకుంటకు చెందిన సంపంగి రాకేష్, ఊబిది వంశీకృష్ణలుగా గుర్తించినట్లు తెలిపారు. వీరు ఇరువురు భద్రాచలంలో ఎండు గంజాయిని తక్కువ రేటుకు కొని ఇక్కడ ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సైలు గోవర్ధన్, మునీరుల్లా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు

కరీమాబాద్, ఏప్రిల్ 29: తన స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తున్న యజమాని, సూపర్‌వైజర్‌లపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మిల్స్‌కాలనీ పోలీసులతోపాటు ఏసీపీ నందిరామ్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు లక్కం సురేష్, రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఉర్సు గుట్ట ప్రాంతంలో 466 గజాల స్థలాన్ని 2019లో గన్ను సురేష్ వద్ద లక్కం సురేష్ కొనుగోలు చేశాడు. ఇందులో 233 గజాల్లో అన్ని అనుమతులతో ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. మిగితా 233 గజాల్లో రెండు నెలల క్రితం ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనుల్లో భాగంగా సోమవారం స్లాబ్ వేసేందుకు వర్కర్లు సెంట్రింగ్ కొడుతుండగా మినుముల భాస్కర్, చిట్టిబాబుతో పాటు మరికొందరు వచ్చి ఇంటి నిర్మాణం ఆపాలని దౌర్జన్యం చేస్తూ, దాడికి పాల్పడుతూ, సెంట్రింగ్ కర్రలను ధ్వంసం చేశారు.

కరెంటు మీటర్, సీసీ కెమెరాలను కూడా పగలకొట్టి భయభ్రాంతులకు గురిచేసినట్లు బాధితులు తెలిపారు. ఈ దాడి వెనకాల ఓ మాజీ కార్పొరేటర్ హస్తం ఉన్నట్లు బాధితులు వివరిస్తూ, తమపై దాడి చేసి, గాయపరిచిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు రేగొండలో.. కాంగ్రెస్ జనజాతర

(5వ పేజీ తరువాయి)

శ్రీహరి కుమార్తె కావడం, ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారిన నేపథ్యంలో వ్యూహాత్మకంగానే ఈ సభ నిర్వహిస్తున్నారని, సభ కు భారీగా జనాన్ని సమీకరించడం ద్వారా ప్రత్యర్థి పార్టీలపై పైచేయి సాధించాలన్న వ్యూహంతో కాంగ్రెస్ శ్రేణులు అడుగులు వేస్తున్నాయని తెలుస్తోంది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పరకాల ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాష్‌రెడ్డి సభ ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి ఈ ఏర్పా ట్లు తుదిదశకు చేరుకున్నాయి.

అయితే ఎండల తీవ్రత నేపథ్యంలో సభకు హాజరయ్యే వారు ఇబ్బందులకు గురాకాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల ఏర్పాటు మొదలుకొని దారి పొడవునా సభకు వచ్చే వారి కోసం తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు. ఇందుకోసం 2.50లక్షల మజ్జిగ ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. సభా స్థలంలో 25వేల మంది కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లతో పాటు మరో 50 వేల మందికి సరిపడేలా షామియానాలను నిర్మిస్తున్నారు. ఉదయం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో జరిగే సభలో పాల్గొన్న తర్వాత రేవంత్‌రెడ్డి రేగొండ రానున్నారు. సీఎం రాకకోసం రేగొండలో హెలిప్యాడ్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేశారు. ముఖ్యమంత్రి ప్రచార షెడ్యూల్ ప్రకారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట నుంచి బయల్దేరనున్న రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 3గంటలకు హెలికాప్టర్‌లో రేగొండకు చేరుకొని జన జాతర సభలో పాల్గొంటారు. ఆయనతో పాటు ఈ సభకు మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ అలియాస్ సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తదితరులు కూడా హాజరుకానున్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 30 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

కారులో తరలిస్తున్న రూ.లక్ష పట్టివేత

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 29 : పట్టణంలోని డీసీ తండా చెక్ పోస్టు వద్ద వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదివారం రాత్రి కారులో తరలిస్తున్న లక్ష రూపాయల నగదు పట్టుబడింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చావుల తండాకు చెందిన తెజావత్ మురళీ తన కారులో రూ. 1 లక్ష నగదును తరలిస్తుండగా తనిఖీల్లో లభ్యమైనట్లు తెలిపారు. అట్టి నగదుకు సంబంధించిన పూర్తి ఆధారాలు లేకపోవడంతో కారును, నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రోడ్డుపైనే వడ్లు, మొక్కజొన్నల ఆరబోత

చెన్నారావుపేట, ఏప్రిల్ 29 : మండలంలోని నెక్కొండ - గూడూరు ప్రధాన రహదారి పదహారు చింతల్ గ్రామ సమీపంలో కొంత మంది రోడ్లపైనే వడ్లు, మొక్క జొన్న ఆరబోయడంతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే వడ్లు, మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోసి ఉండడంతో రాత్రి వేళల్లో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. అలాగే ఎదురురెదుగా వాహనాలు వస్తుండడంతో వాహనాలు వెళ్లడం ఇబ్బందికరంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన పంటలను ఆరబెట్టుకోవడానికి ప్రత్యేకంగా ప్రదేశాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ధాన్యాన్ని రోడ్డుపైన అరబెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



పదహారు చింతల్ తండా సమీపంలో రోడ్డుపై ఆరబోసిన వడ్లు

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం : పెద్ది

ఖానాపురం, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అశోక్ నగర్, దబీర్‌పేట, మనుబోతుల గడ్డ, బుధరావుపేట, ధర్మరావు పేట, ఖానాపురం, మంగళవారిపేట, కొత్తూరు, రంగాపురం గ్రామాల్లో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోస పూరిత హామీలతో ప్రజలు తిరుగుబాటు చేసే పరిస్థితి రానుందన్నారు. వరి ధాన్యానికి మద్ద తు ధరతో పాటు రూ.500బోనస్ చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టానికి అనుగుణంగా పోడు భూములను, భూములులేని గిరిజనులకు పట్టాలు చేసి ఇచ్చిన ఘనతా కేసీఆర్‌దే అన్నారు. పాకాల ప్రాజెక్ట్ భూటకమన్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడూ అదే ప్రాజెక్ట్‌తో నీళ్ల ఇస్తున్నామంటున్న వారికి సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన మాలోతు కవితను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అదేవిధంగా ఖానాపురం, మనుబోతుల గడ్డలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో మాట్లాడి ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, ఎంపీపీ వేము లపల్లి ప్రకాశ్‌రావు, జడ్పీటీసీ బత్తిని స్వప్నశ్రీనివాస్‌గౌడ్, వైస్ఎంపీపీ రామసహాయం ఉమా ఉపేందర్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు మస్తాన్, మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న పెద్ది

మినీ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 29 : నర్సంపేట పట్టణంలోని మినీ స్టేడియంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి కబడ్డీ, రెజ్లింగ్ క్రీడల శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ జిల్లా అధికారి టీవీఎల్ సత్యవాణి సోమవారం తెలిపారు. నిష్ణాతులైన కోచ్‌ల ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, క్రీడాకారులు పూర్తి వివరాలకు కోసం 9666623438, 6305271260 సెల్ నెంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామి

నెక్కొండ, ఏప్రిల్ 29 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నెక్కొండకు చెందిన దళితరత్న వద్దూరి కుమారస్వామిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య సోమవారం తెలిపారు. కుమారస్వామి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వర్గీకరణ ఉద్యమాల్లో ఎంతో చురుకుగా పనిచేయడమే కాకుండా పేదలకు తన వంతు సేవలను అందిస్తుండడంతో అతని సేవలను గుర్తించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు చెప్పారు. తన నియమకానికి కృషి చేసిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులకు కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు. జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు దక్కాల్సిన 15 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉద్యమిస్తామన్నారు.



కుమారస్వామి

చల్లని ఉపశమనం..!

ఎండలకు.. శీతల పానియాల వైపు ప్రజలు

ప్రధాన సెంటర్లలో వెలసిన జ్యూస్ సెంటర్లు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 29 : ఎండలు మండుతున్నాయి. ఉదయం 10గంటలు దాటితే జనం ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. తప్పని పరిస్థితుల్లో బయటకు వెళితే భానుడి ప్రభావంతో తీరని దాహం వేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాల వైపు చూస్తున్నారు. పండ్ల రసాలు, చెరుకు జ్యూస్ వంటి వాటిపై మక్కువ చూపుతున్నారు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా పట్టణంతో పాటు గ్రామాల్లో సైతం జ్యూస్ సెంటర్లు వెలిశాయి. వర్ధన్నపేట బస్టాండ్, అంబేద్కర్ సెంటర్, ప్రధాన కూడళ్లతోపాటు ఆటో స్టాండ్ల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచారు. వీటిల్లో ద్రాక్ష, కర్బూజ, ఆపిల్, ఆరెంజ్, మామిడి, పైనాపిల్ జ్యూస్, ఫ్రూట్ సలాడ్, లస్సీని విక్రయిస్తున్నారు.బేకరీల్లో ఐస్‌క్రీమ్‌లకుసైతం డిమాండ్ పెరుగుతోంది. వివిధ ఫ్లేవర్లతో కూడిన ఐస్‌క్రీంలను వ్యాపారులు అందుబాటులో ఉంచుతున్నారు.

• సబ్జా కలిపితే ఆరోగ్యం దర్జా...

వేసవి దాహం, నీరసం, నిస్సత్తువ లాంటి వాటి నుంచి ఉపశమనం పొందాలన్నా.. అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలన్నా కాసిన్ని సబ్జా గింజలు నానేసి పాలతో, నిమ్మకాయ రసంతో కలిపి తాగితే ఎండ, చెమటకారణంగా పోయిన పోషకాలను తిరిగి రాబట్టుకోవచ్చు. ఈ సబ్జాలను జ్యూస్ సెంటర్ల నిర్వాహకులు లస్సీలో, వివిధ ఐస్ క్రీమ్‌లలో కలిపి ఇస్తున్నారు. సబ్జాలతో కస్టర్డ్ ఫలూడా, పుచ్చకాయ జ్యూస్, రూఫ్జా, రోజ్ మిల్క్, సబ్జా పాయసం లాంటి వెరైటీలు చేసుకుని తాగవచ్చు.

• ఇంటి వద్దకే చెరుకు రసం...

ఇతర రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు స్థానికంగా నివాసముంటూ చెరుకు రసాలను తయారు చేస్తున్నారు. డీజీల్‌తో నడిచే చెరుకు బండ్లను తయారు చేసుకుని ఇంటి వద్దకే వెళ్లి విక్రయిస్తున్నారు. ప్రధాన రహదారులతో పాటు వివిధ వీధుల్లో తిరుగుతూ చెరుకు రసాన్ని ప్రజలకు అందిస్తున్నారు.

• వెలసిన ఫలుడా వాహనాలు...

రాజస్థాన్‌కు చెందిన కొందరు యువకులు ఫలుడా వాహనాల ద్వారా చల్లటి పానీయాలను అందిస్తున్నారు. ఉదయం లేవగానే వారి నివాస గృహాల వద్ద ఫలుడా వాహనాలలో వివిధ రకాల ఐస్‌క్రీమ్‌లతో పాటు ప్రత్యేక ఫ్లేవర్లతో కూడిన పండ్ల రసాలు, చెర్రీలతో తయారు చేసే బాదం మిల్కులు తయారు చేసి, వాహనాలను అనుకూలంగా ఉన్నచోట నిలిపి విక్రయిస్తున్నారు.



సయ్యద్ హసన్ ఏర్పాటు చేసిన లస్సీ పాయింట్

• చాచా లస్సీ ఫేమస్..

వర్ధన్నపేట పట్టణంలో గత 20 సంవత్సరాలుగా సయ్యద్ హసన్ అనే వృద్ధ దంపతులు లస్సీ, సోడా నాలుగు చక్రాల బండిపై ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేస్తున్నారు. కొత్త బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ లస్సీ పాయింట్ ఎంతో ఫేమస్. చాచా లస్సీ తాగేందుకు ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు. రూ.20కి లస్సీ, రూ.10 నిమ్మకాయ సోడా అందిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు పదులు దాటిన ఈ వృద్ధులు వేసవి కాలంలో శీతల పానీయాలు అందించడంతోపాటు ఇతర సీజన్‌లో స్వీట్ కార్న్, పల్లికాయ అమ్ముతారు. గత 50ఏళ్లుగా ఈ వృత్తినే నమ్ముకుని జీనం సాగిస్తున్నామని, తన తండ్రి నుంచి ఇదే పనిని నేర్చుకున్నట్లు హసన్ తెలిపాడు.

మానుకోటలో బలరాంనాయక్ గెలుపు ఖాయం

కాబోయే ప్రధాని రాహుల్ గాంధీనే..

వ్యవసాయశాఖ మంత్రి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వర్‌రావు

దుగ్గొండి, ఏప్రిల్ 29 : మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్ గెలుపు ఖాయమని, ప్రధానిగా రాహుల్ గాంధీ అవడం తథ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి పార్లమెంట్ ఇన్‌చార్జి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో గత పాలకులు అప్పుల రాష్ట్రంగా తయారు చేయగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసిందన్నారు. దేశంలో బీజేపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతుల సంక్షేమం వదిలి నల్ల చట్టాలు తెచ్చిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. రైతులు తిరగ బడితే వారిని కొట్టించడం, ఉక్కుపాదం మోపిన కీర్తి పీఎం నరేంద్రమోదీకే చెల్లుబాటైందన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని అన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధిని ప్రజలు చూశారని, బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు కష్టాలు అనుభవించారన్నారు. గత ప్రభుత్వం రైతుల రుణ మాఫీ చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతు ఆత్మహత్యలు కూడా పెరిగాయన్నారు. రైతులపై చిత్తశుద్ధిలేని కారణంగా రైతుల అప్పుల ఊబిలో కూరుకు పోయారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి, అమలు చేస్తోందన్నారు. భారీ మెజార్టీతో బలరాంనాయక్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలకు సేవకుడిగా పని చేస్తానన్నారు. గత ఎంపీగా గెలిచిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్రాలకు వారధిగా పని చేసి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో డీసీసీ అధికారి ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, రంజిత్ రెడ్డి, పెండెం రామానాధం, పాలయి శ్రీనివాస్, ఓర్సు తిరుపతి, ఎర్రెల బాబు, పార్వతమ్మ, ఒలిగె నర్సింగ రావు, చెన్నూరి కిరణ్‌రెడ్డి, చుక్క రమేశ్, జయరాంనాయక్, గోపాల్ నాయక్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగేశ్వర్‌రావు

తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడే ఏకైక పార్టీ టీజేఎస్

నర్సంపేట, ఏప్రిల్ 29 : తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడగలిగే ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి (టీజేఎస్) అని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావెద్ అన్నారు. తెలంగాణ జన సమితి ఆవి ర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణం లోని పార్టీ కార్యాలయం ఆవరణలో టీజేఎస్ జెండాను ఆ పార్టీ నాయకులు గుంటి రాంచందర్, బొనగాని రవీందర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళుగా ప్రజా సమస్యలపై తెలంగాణ జన సమితి పోరాడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై. భూ నిర్వాసితులపైన రైతుల సమస్యలు, కార్మికుల సమస్యలు, నిరుద్యోగ సమస్యపై పార్టీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలను చేపట్టామన్నారు ప్రజాస్వామిక రాజకీయాలే ఎజెండాగా పార్టీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు గుంటి సంజీవ, మహ్మద్ సంథాని, సోల్తి సాయికుమార్, సాంబరాతి మల్లేశం పాల్గొన్నారు.



టీజేఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు జావిద్

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌కు మోక్షం

• 'ఆంధ్రజ్యోతి' కథనంతో సమస్య పరిష్కారం

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 29 : వర్ధన్నపేట పట్టణంలోని రెండో వార్డులో గల రాజస్థాన్ వీధిలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఇండ్ల నివాసాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెకు రక్షణ వలయం లేకపోవడంతో గతంలో ఓ బాలుడి ప్రమాదానికి గురై ప్రాణాలతో బయటపడ్డాడు. ఇదే విషయం పై ఆంధ్రజ్యోతిలో జనవరి మాసంలో వచ్చిన కథనంతో విద్యుత్ అధికారులు నివారణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఏడీఈ కన్న రాజు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభించి, సోమవారం పూర్తి చేసినట్లు తెలిపారు. మరెవరికి ఇబ్బందులు కాకుండా శాశ్వత పరిష్కార మయ్యేలా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో పెట్టినట్లు తెలిపారు. గద్దెను ధ్వంసం చేసి, పిల్లరు ఏర్పాటు చేసి దానిపై స్లాబ్ వేసి భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా చేశామన్నారు. మండలంలో ఇలాంటి సమస్యలపై చర్యలు తీసుకుంటున్నామని, ఒక్కొక్కటిగా పనులు పూర్తి చేశామని స్పష్టం చేశారు.



పిల్లరు పై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ఆర్ఎంపీపై కేసు నమోదు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 29 : పట్టణంలో చికిత్స పొందుతూ మృతి చెందిన కత్తి నవీన్(28)కు వైద్య పరీక్షలు చేసిన స్థానిక ఆర్ఎంపీ ఆడెపు శ్రీనివాస్‌పై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం... వర్ధన్నపేటకు చెందిన నవీన్ గీత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న నవీన్ జ్వరంతో బాధపడుతుండగా తన భార్య మేఘన, చెల్లెలు దివ్యలు పీరంగిగడ్డ ప్రాంతానికి చెందిన ఆర్ఎంపీ ఆడెపు శ్రీనివాస్ వద్దకు తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేసిన శ్రీనివాస్, నవీన్‌కు ఇంజక్షన్ వేసి, గ్లూకోజు పెట్టి వాటిలో కూడా మరో నాలుగు ఇంజక్షన్‌లు చేశాడు. అనంతరం నవీన్‌కు దాహం కావడంతో నీటిని తాగించి, మళ్లీ నరానికి మరో ఇంజక్షన్ వేయడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో వెంటనే ఆర్ఎంపీ శ్రీనివాస్ భయపడి తానే స్వయంగా వర్ధన్నపేటలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వరంగల్‌కు వెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం, మళ్లీ హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్సులో యశోద ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నవీన్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నవీన్ మరణ వార్త తెలిసిన ఆర్ఎంపీ శ్రీనివాస్ ఆస్పత్రికి, తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా పరారయ్యాడు. ఆర్ఎంపీ వైద్యం వికటించే నవీన్ చనిపోయాడని భార్య కత్తి మేఘన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆర్ఎంపీ శ్రీనివాస్‌పై ఐపీసీ 304(2) సెక్షన్ కింద కేసు నమోదు చేసి, మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 29 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎన్నికల అబ్జర్వర్ స్వాగత్ రణ వీర్‌చంద్ సూచించారు. సోమవారం పట్టణంలోని డీసీతండా వద్ద ఎస్ఎస్‌టీ చెక్ పోస్టును తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా వాహనాలను తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. మద్యం, డబ్బు తరలించేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా ఎవరు చేసినా వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ అంబటి నర్సయ్య, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎన్నికల అబ్జర్వర్ స్వాగత్ రణవీర్ చంద్

• నోడల్ అధికారి తనిఖీలు...

పట్టణంలోని డీసీ తండా ఎస్ఎస్‌టీ చెక్ పోస్టును సోమవారం ఉదయం ఎంసీసీ నోడల్ అధికారి, వర్ధన్నపేట మునిసిపాలిటీ కమిషనర్ ఇ.జోనా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులోని రికార్డులను పరిశీలించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంగా అధికారులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్వే లైన్ టీంలు సక్రమంగా విధులు నిర్వర్తించాలని తగు సూచనలు చేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 29 : ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు వ్యక్తులకు గాయాలైన సంఘటన మండలంలోని కట్ర్యాలలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... కట్ర్యాలకు చెందిన చెంగల అంజయ్య తన బైక్‌పై వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా, రాయపర్తికి చెందిన ఎల్లయ్య, డీసీ తండాకు చెందిన రామచంద్రులు ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై వర్ధన్నపేట నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్సులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూస్తాం : జోనా

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 29 : పట్టణంలో తాగునీటి సమస్యలు లేకుండా చూడడమే లక్ష్యమని వర్ధన్నపేట కమిషనర్ ఇజోనా అన్నారు. సోమవారం పట్టణంలోని ఐదో వార్డులో గల నీలగిరిస్వామి తండాలో పైపు లైన్ లీకేజీ కావడంతో తండావాసులకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్ని కమిషనర్ వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు మునిసిపాలిటీ సిబ్బందితో వెంటనే మరమ్మతు పనులను చేపట్టగా వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి లేకుండాచూసేందుకుగాను పట్టణంలో ముగ్గురు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



నీలగిరి స్వామి తండాలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జోనా

బీజేపీ ఇంటింటి ప్రచారం

వర్ధన్నపేటరూరల్, ఏప్రిల్ 29 : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని బూత్ స్థాయి నాయకులు కరపత్రాలు పంచుతూ ప్రజలను వేడుకున్నారు. మండలంలోని కట్ర్యాల, ఇల్లంద, వర్ధన్నపేట మునిసిపాలిటీలో నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుందూరు మహేందర్‌రెడ్డి, జడ సతీష్, కొండేటి సత్యం, గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను కలిసిన నాయకులు

పర్వతగిరి, ఏప్రిల్ 29 : మే నెలలో జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయనున్న తీన్మార్ మల్లన్న సోమవారం హన్మకొండకు రావడంతో ఆయనను తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద రవీందర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మతోన్మాద బీజేపీని ఓడించాలి'

చెన్నారావుపేట, ఏప్రిల్ 29: మతోన్మాద ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని పాపయ్యపేటలో భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మహమ్మద్ గోర్మియా అధ్యక్షతన నిర్వహించారు. పెద్దారపు రమేష్ మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వల్లనే భారత రాజ్యాంగానికి, భారతదేశానికి పెద్ద ముప్పు ఉందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని ప్రజలను కోరారు. వరంగల్, నల్గొండ, చేవేళ్ల పార్లమెంట్ స్థానాలకు బీఎల్ఎఫ్ భాగస్వామ్య పక్షాలకు మద్దతునిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కన్నం వెంకన్న, మహమ్మద్ రాజాసాహెబ్, జన్ను రమేష్, మొర్రి శ్రీను, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శోభ, చంద్రు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మే డేను ఘనంగా జరుపుకోవాలి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 29 : మేడే వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా జరుపుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు కొత్తకొండ రాజమౌళి పిలుపునిచ్చారు. మండలంలోని మాధన్నపేటలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 138 ఏళ్ల క్రితం చికాగో నగరంలో కార్మికులు సాగించిన పోరాట ఫలితంగా హక్కులు సాధించబడ్డాయని, వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని నేటి పాలకులపై కార్మిక వర్గం సమరశంఖం పూరించాలన్నారు. దేశం, రాష్ట్రంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతున్నదన్నారు. కార్మిక చట్టాలను పాలకులు కాలరాస్తూ సమ్మె హక్కు లేకుండా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మే 1న వాడవాడన ఎర్రజెండాలు ఎగురవేసి పోరాట స్ఫూర్తిని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమ సారయ్య, గుర్రం రవి, ఆకుల రాజేందర్, శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.

'అమరుల త్యాగాలు వృథాపోవు'

దుగ్గొండి, ఏప్రిల్ 29 : ప్రజలకోసం పని చేసి అమరులైన వారి త్యాగాలు వృథాపోవని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్న చంద్రన్న, గౌని ఐలయ్యలు అన్నారు. మండలంలోని తిమ్మంపేటలో న్యూడెమోక్రసీ పార్టీ క్రియాశీలక కార్యకర్త ఎలకంటి బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం గుర్రం అజయ్ అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. సభకు హాజరైన చిన్న చంద్రన్న, ఐలయ్యలు మాట్లాడారు. సంస్మరణ సభలో ఏఐకేఎస్ నాయకులు బాలరాజు, జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు తోటకూరి రాజు, కాంగ్రెస్ నాయకుడు చౌడారపు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ బస్సు యాత్రకు స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 29 : నియోజకవర్గ కేంద్రం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కేసీఆర్ బస్సు యాత్రకు బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికారు. సోమవారం ఖమ్మం జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న కేసీఆర్ బస్సుకు వర్ధన్నపేట పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద స్వాగతం పలికి పూలు చల్లుతూ ముందుకుసాగారు. బస్సులో కూర్చునే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అభివాదంచేశారు. అనంతరం బస్సు ఖమ్మం జిల్లాకు వెళ్లిపోయింది. బీఆర్ఎస్ నేతలు బస్సును వివేకానంద విగ్రహం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీగా తీసుకెళ్దామని భావించినప్పటికీ కేసీఆర్ బస్సు ఆగకుండా వెంటనే ముందుకు వెళ్లిపోవడంతో అందరూ నిరాశకు గురయ్యారు.

• రాయపర్తి : ఖమ్మం జిల్లాకు ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికారు. వరంగల్-ఖమ్మం జాతీయ రహ దారిపై కేసీఆర్ రాకతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్య కర్తలు అభివాదం చేస్తూ నినాదాలుచేశారు. కేసీఆర్ నాయ కులకు, కార్యకర్తలను చూసి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, ఎండీ నయీం, చందు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మానుకోట సభకు తరలిన బీజేపీ శ్రేణులు

ఖానాపురం, ఏప్రిల్ 29 : మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని మహబూబాబాద్‌లో సోమవారం భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్న బహిరంగ సభకు మండలంలోని బీజేపీ శ్రేణులు తరలి వెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి తడుక అశోక్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి జల్లి మధు, లింగబత్తుల యాకసాయన్న, కుమారస్వామి, నార్లపురం పాపయ్య, శోభన్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

నేడు రేగొండలో.. కాంగ్రెస్ జనజాతర

(5వ పేజీ తరువాయి)

శ్రీహరి కుమార్తె కావడం, ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారిన నేపథ్యంలో వ్యూహాత్మకంగానే ఈ సభ నిర్వహిస్తున్నారని, సభ కు భారీగా జనాన్ని సమీకరించడం ద్వారా ప్రత్యర్థి పార్టీలపై పైచేయి సాధించాలన్న వ్యూహంతో కాంగ్రెస్ శ్రేణులు అడుగులు వేస్తున్నాయని తెలుస్తోంది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పరకాల ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాష్‌రెడ్డి సభ ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నారు. సోమవారం సాయంత్రానికి ఈ ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. అయితే ఎండల తీవ్రత నేపథ్యంలో సభకు హాజరయ్యేవారు ఇబ్బందులకు గురాకాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల ఏర్పాటు మొదలుకొని దారి పొడవునా సభకు వచ్చే వారికోసం తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు. ఇందుకోసం 2.50లక్షల మజ్జిగ ప్యాకెట్లను సిద్ధంచేస్తున్నారు. సభా స్థలంలో 25వేల మంది కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లతో పాటు మరో 50వేల మందికి సరిపడేలా షామియానాలను నిర్మిస్తున్నారు. ఉదయం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో జరిగే సభలో పాల్గొన్న తర్వాత రేవంత్‌రెడ్డి రేగొండ రానున్నారు.సీఎం రాకకోసం రేగొండలో హెలిప్యాడ్ నిర్మాణ పనులు కూడా పూర్తిచేశారు. ముఖ్యమంత్రి ప్రచార షెడ్యూల్ ప్రకారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట నుంచి బయల్దేరనున్న రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 3గంటలకు హెలికాప్టర్‌లో రేగొండకు చేరుకొని జన జాతర సభలో పాల్గొంటారు. ఆయనతో పాటు ఈ సభకు మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ అలియాస్ సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తదితరులు కూడా హాజరుకానున్నారు.